# కూలి!

రచన:
ఆయపిళ్ళ సత్తిబాబు

ప్రపంచంలో కూలి ఓ నిర్భాగ్యజీవి.

ముష్టిజీవనానికి, కూలిజీవనానికి ఆట్టే వ్యత్యాసంలేదు. చేతులు కాళ్లూ ఆడ్డానికి అవకాశం లేనంతటి బలహీనత్వంలోకి రాగానే కూలి, ముష్టివాడిగా మారిపోతున్నాడు. అప్పుడప్పుడు కొన్నిపూటల పస్తులతో సగంకడుపును నింపుకునయినా ముష్టి జీవితం గడుస్తుంది. కాని కూలికిమట్టుకు కొన్నిదినాలవరకూ పస్తులుపడవలసినఅవస్థ వస్తూవుంటుంది.

* * *

సృష్టికి జీవనాధారం కర్షకుడు.

కూలిమాత్రం యీ యావత్తు సృష్టికి ఓ ఆర్టిస్టు!

* * *

ప్రపంచంలో ప్రతి నౌకరీకి నిలుకడ అంటూ యేర్పాటయివుంది. కాని కూలి మట్టుకు యెప్పుడూ పొట్టకూలీయే!

రెక్కలాడితేగాని డొక్కలాడవంటారు. రెక్కలాడినప్పటికి డొక్కలు నింపుకోలేక కూలీలమూటేమంటారు?

* * *

నిత్యజీవనానికి కూలి ఓ అత్యవసరమయిన పనిముట్టు. అందరికీ కావలసినవాడవటంచాతనే కాబోలు కూలీ అంత హేళనఅయ్యాడు.

బజారుకువెళ్ళి సామానులు తీసుకురమ్మంటే కూలిమనిషల్లె సామానులు యెవరు మోసుకువస్తారని మూలుగుతాడు ముద్దబ్బాయ్!

ముత్తయిదువుల్ని పిల్చుకురావటానికి పసుపుకుంకంపళ్ళెం పట్టుకునేందుకు వెనక కూలిపనిదిలేనిది ఎలావెళ్ళనని గునుస్తుంది, ఎడ్యుకేటెడ్ అమ్మాయ్!

చంకను పిల్లడిచేత నడవలేక అడుగులు తడబడుతున్న ఓఆవిడ ముందు నడుస్తూన్న భర్తను ఓమాటు పిల్లణ్ణి చంక వేసుకోమంటే ఉరుముతాడు. పైగా "నడిరోడ్డుమీద...కూలివెదవల్లె యెవడెత్తుకుంటాడు...నడువ్!" అని వెనక్కు తిరిగయినా చూడడు. అలా చూసినట్లయితే అతడి పరువుకెంతభంగం మరి!

తాతయ్య ట్రెయిన్‌దిగ్గానే "ఒరేవ్ కూలీ!" అని కేకవేస్తాడు. కూలి ఏనాడో అతడి బానిసగా పుట్టినట్టు!—

బి. ఏ. పట్టా పొందినప్పటికి తెచ్చుకున్నది కడుపుకు జరక్కపోవడంవల్ల బజారుకుపోయి కూరలుతీసుకొచ్చేసంసారినిచూసి ఓర్వలేదుప్రపంచం! "పోనిద్దూ కూలివెధవ బ్రతుకు" అంటుంది. ఎంత నిరసనం!

కూలికి నోరులేదనేనా? ఉంటే పళ్ళూడ గొట్టేవాడే.

దొరవారు బస్సుదిగింతర్వాత పెట్టె మోతకు 0-3-0 అడిగినకూలీని ‘‘పూర్వం అణాడబ్బులిచ్చే కూలికి యిప్పుడు మూడణాలు కావలిసొచ్చిందిరా ముండాకొడకా’’ అని తిడతాడు, పక్కనున్న అతని ‘‘లేడీ’’ వెకవెక నవ్వేట్టు—కాని అతడి యాభై రూపాయిల నౌకరీకి యిప్పుడు నూటయాభై యెలాగందుతున్నదో ఒక్క పిసరయినా ఆలోచించడుకదా!—


సుధా చంద్రిక

అన్ని శగలను ఒక్కరోజులో పోగొట్టును. శగ, మూత్రనాళమందలి మంట, చురుకు తగ్గించును. గనేరియా క్రిములను ఎంతకాలము నుండియున్నను సంహరించి వ్యాధిని మొదలంట నివారించును.

చంద్ర

స్త్రీల ఋతుశూల, ఋతుబద్ధము, ఎరుపు, తెలుపు కుసుమలు, రజోదోషములను పోగొట్టి, ఆరోగ్యజీవనము నిచ్చును.

చంద్ర:—గర్భాశయరోగ నివారిణి.

అన్నిచోట్ల దొరకును.

క్షీరసముద్రం ఫార్మసీ,

రాజమండ్రి.


అవసరంకొద్దీ బజార్లో ఆరణాలు యిస్తానన్నవ్యక్తి యింటికివచ్చాక కూలికి అణాకానీ యిస్తే-ఆబలహీనమైన నిర్భాగ్య కూలీపక్షాన్ని సాక్ష్యమిచ్చి రుజువుపలికే వ్యక్తి ఏడీ?—

* * *

ప్రపంచంలో కూలి నిత్యజీవనానికి సహాయపడే స్నేహితుడు, బంధువు. ప్రపంచాన్ని నూతనకళాకాంతులతో తీర్చిదిద్దే వ్యక్తి కూలీ!

కర్మాగారాల్లో యంత్రం యెంత ముఖ్యమో కూలికూడ అంతఅవసరం.

జమీందారుల పెరళ్ళల్లో డబ్బును పాతరలువేసేది కర్షకుడు!—ఫాక్టరీ యజమానుల కోశాల్లో కోట్లకొద్దీ ధనాన్ని కుప్పలుగాపోసింది కూలీమాత్రం!

అయినా కూలికి తిండిలేదు—

* * *

అసలు నౌకరీ అంటేనే బానిసత్వం! బానిసగావున్న ఉద్యోగికి, కూలీకి యేం భేదం?—నిత్యం పనిజరిగే ఫాక్టరీల్లోకూడ యీ పక్షపాతం దేనికి? ఉద్యోగస్థునికున్న కొన్నిసౌకర్యాలయినా కూలీకి లేవెందుచాత!

‘‘కూలీలందరు ఏకముగాఖలెరా’’